
కథ

# తోడు

కప్పగంతుల మల్లికార్జునరావు



ఎవరో తట్టిలేపినట్లయి ఉలిక్కిపడి నిద్రలేచాడు రాజారావు. ఎవరూ లేరు. గోడ గడియారం ఎనిమిది గంటలు కొట్టింది.

“ఏమండీ! మనుష్యులు సూర్యభగవానుడికన్నా ముందే నిద్రలేవాలండీ.”

“ఆహా! కోడి కన్నా ముందుగానే తీస్తున్నావుగా నువ్వు?”

“నాకోసం మీరు కూడా లేవచ్చు కదా? నాకేమో నిద్రలేవగానే కాఫీ తాగటం అలవాటు. మీరు లేకుండా ఒంటరిగా కాఫీ తాగితే నాకు రుచించటం లేదండి.”

బారెడు పొద్దెక్కాక పక్క మీద నుంచి లేచే అలవాటును కాలేజీ చదువు చేసింది. ఆ అలవాటును మాన్పించింది సుభద్ర.

తెలతెలవారుతుండగా లేచి కాస్సేపు వాకిట్లో అలా అలా పచారు చేసేసరికి కాఫీ రెడీ. సుభద్రతో కలసి ఆ చల్లని వాతావరణంలో కాఫీ తాగుతుంటే ఎంత హాయి! ఆమె చేతి కాఫీ ఎంత రుచిగా ఉండేది?

చలపతి కూడా కాఫీ జీవే. కాని అతను నిద్రలేచేది ఏడింటికి. కాఫీ తాగేది ఏడున్నరకి.

అవునూ? ఇవాళ చలపతికూడా లేచిన జాడ కన్పించదేం?

రాత్రి ఒంట్లో బాగాలేదన్నాడు. టెంపరేచర్ కానీ రాలేదు కదా?

రాజారావు మంచం మీదినుంచి ఒక్క ఉదటున లేచి వంటగది వైపు పరుగెత్తాడు.

చలపతి కూడా తన లాగే ఒంటరి. కాకపోతే తనకు డబ్బుంది. అతనికి లేదు.

అతని వృత్తి వంటలు చేయటం. కానీ అందులోనూ అతను పెద్దగా రాణించలేదు. అతను వండిన పదార్థాలలో పాళ్లు సమంగా ఉండేవి కాదు. ఉప్పో, కారమో ఏదో తక్కువో, ఎక్కువో అయ్యేవి.

అంచేత అతను పెద్ద పెద్ద వంటలు చేసేవారికి సహాయకుడిగా ఉండేవాడు.

అతని కొడుకులు మాత్రం గజ వంటగాళ్లుగా పేరు పొందేరు.

చలపతి బిడ్డల ప్రతిభను చూసి సంతోషించాడు. వాళ్ల నీడనే ఉండాలని ఆశించాడు. కానీ వాళ్లు ఆయన్ని తమ జట్టులోకి తీసుకోలేదు.

అంతే కాదు. ఆయనకు పిడికెడు మెతుకులు పెట్టటం కూడా భారంగా భావించారు. బిడ్డలుండీ ఒంటరివాడయ్యాడు.

కానీ తన విషయం అలా కాదు.

నెత్తిన పెట్టుకొని పూజించే కొడుకు  కోడలు, కూతురు అల్లుడు ఉండి కూడా తను ఒంటరితనాన్నే ఎన్నుకున్నాడు.

“ఏమండీ! మనం అలవాటు పడ్డ జీవన విధానానికి ఎంత వ్యత్యాసం ఉందో చూచారా? కన్నబిడ్డల దగ్గర నాలుగురోజులు ఉండేసరికి ఎవరో కొత్తవారింట్లో ఉన్న భావం కలిగింది నాకు. ఎప్పుడెప్పుడు మన ఇంటికి వచ్చేద్దామా అనిపించింది. మీకెలా అనిపించిందో? ఎల్టీసీ మీద ఒకసారి కొడుకు ఇంటికి, కూతురు ఇంటికి వెళ్లి పదిరోజులు ఉండి వచ్చాక అంది సుభద్ర.

“నాకూ అలాగే అనిపించింది సుభద్రా! మన బిడ్డలకు మనం అంటే గౌరవం, ప్రేమ ఉన్నాయి. మనకు వారేం లోటు చెయ్యలేదు. మర్యాదగా చూచారు. అయినా వారి జీవితంలో ఏమో లోటు నాకూ కన్పించింది.”

“అలా అనకండి. వారికి మన జీవన విధానంలోనే ఏదో లోటు కన్పించి ఉండవచ్చు. ఇప్పుడే ఇలా ఉంటే రేపు మీరు రిటైరయ్యాక...”

“నా గురించి నాకు చింతలేదు సుభద్రా! నా దిగులల్లా నిన్ను గురించే. ఎందుకంటే నా జాతకం ప్రకారం రిటైరయిందాకా బ్రతుకుతానన్న నమ్మకం లేదు నాకు. ఆ తర్వాత నువ్వు...”

“ఛ ఛ! ఎప్పుడూ అవేం మాటలండీ! మీరలా అనకండి. నేను భరించలేను. మీరు లేని జీవితాన్ని ఊహించుకోలేను.”

“ఊహించుకోవాలి సుభద్రా. అప్పుడే పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోగలుగుతావు.”

“మీకన్నా ముందుగా నేనే పోతే అప్పుడు మీరేం చేస్తారో చెప్పండి?”

“ఆ ఆలోచనే నేను చెయ్యను. ఎందుకంటే నీ కన్నా నేనే ముందు పోతానని నాకు తెలుసు.”

“అయితే చర్చను ఆపేద్దాం. ఇద్దరం మీరు రిటైరయ్యాక కూడా చాలాకాలం బ్రతికి ఉంటామనుకొందాం. అప్పుడేం చేయాలో ఆలోచిద్దాం.”

“ఏం చేద్దామంటావ్? డబ్బు కట్టి ఏదన్నా వృద్ధాశ్రమంలో చేరుదామా?”

ఛీ ఛీ... మనకేం కర్మండీ కన్నబిడ్డలు ఇద్దరుండగా?"

"మరి వారి జీవన విధానం, మన జీవన విధానాలలో వ్యత్యాసం ఉందనుకొన్నాం కదా? కొన్నాళ్ల తర్వాత మనం వారికి ఆర్థికంగా కాకపోయినా ఫిజికల్‌గా బరువుగా అన్పిస్తామేమో!"

"అంత అవసరమయితే మనం అడ్జెస్ట్ కావాలండీ. మన పూర్వీకులు ఆశ్రమ ధర్మాలలో వానప్రస్థాన్ని అందుకే ఏర్పాటు చేశారు. మనం వృద్ధులమయ్యాక మన మార్గంలో మన బిడ్డలు నడవాలని ఆశించకూడదు. వారి మార్గంలో నడవటానికి మనం ప్రయత్నించాలి. మనం వారిని ఆక్షేపించకూడదు. వారి పంథానే ఆనందంగా స్వీకరించాలి."

"అమ్మయ్య! నా కిప్పుడు నీ ఉపన్యాసం విన్నాక తృప్తిగా ఉంది. నీ గురించిన చింత నాకిక ఏ మాత్రం ఉండదు. ఎందుకంటే నేను పోయినా నువ్వు బిడ్డల్లో ఇమిడిపోయి జీవించగలవు."

"మీరైనా అలాగే జీవించాలండీ. ఎందుకంటే అది ప్రకృతి ధర్మం. రాలటానికి సిద్ధంగా ఉన్న ఎండుటాకులకూ, అప్పుడే చిగురేసిన ఆకులకూ తేడా లేదా?"

"కానీ అది అందరికీ సాధ్యం కాదు గదా! నేను మామూలు మనిషిని. నువ్వు లేని జీవితాన్ని నేను ఊహించుకోలేను. నీ తలపులతో ఒంటరిగా నైనా ఉండగలనుకానీ..."

"ఛీ ఛీ! అలా మాట్లాడకండీ. నా మీద ఒట్టు."

రిటైరయ్యాడు తను. ఆరోగ్యం చెడింది. మొదటి నుంచీ తన ఆరోగ్యం అంతంత మాత్రమే. ఏవో మాయదారి రోగాలు. బ్రతకనివ్వవు. చావనివ్వవు.

వాటన్నింటికీ మందు సుభద్రే.

డాక్టర్ కాఫీ తాగవద్దన్నాడు.

అలాగే చెప్తాడు. ఆయనకేం? ఒకసారి ఆయనకో కప్పు కాఫీ ఇవ్వు. నీచేతి కాఫీ తాగకుండా ఉండటం ఎంత కష్టమో ఆయనకి తెలిసి వస్తుంది. ఉదయాన్నే లభ్యమయ్యే ఆ మధురానుభూతి కోసం ప్రాణాల్ని తృణప్రాయంగా వదులుకోవటానికి నేను సిద్ధం!

మర్నాడు సుభద్ర ఒక్క కప్పుతో కాఫీ తెచ్చి అతనికిచ్చింది.

"మరి నీకు?"

"నే నీరోజునుంచి కాఫీ మానేస్తున్నాను!"

తన కర్థమయింది. కళ్లు చెమర్చాయి.

"సుభద్రా! నా కోసం నువ్వు కాఫీ త్యాగం చేస్తున్నావా?" దగ్గరికి తీసుకొని అన్నాడు ఆర్ద్రంగా.

"త్యాగమా? చాలా గొప్ప త్యాగమే అన్నీ వదులుకోవాల్సిన ఈ వయసులో! మంచి వయసులో ఉన్నప్పుడే నాకోసం నిద్రాసుఖాన్ని మీరు త్యాగం చేశారు. గుర్తు లేదా?"

డాక్టర్ తనను ఉప్పు, కారం, పులుపు, తీపి ఉన్న వస్తువులన్నీ తినటం మానేయమన్నాడు.

అవన్నీ ముందు సుభద్ర మానేసింది.

"నన్ను ఇలా రెండు విధాల పనిష్ చేయటం ఏం బాగా లేదు సుభద్రా. డాక్టర్ చెప్పాడని నాకు పెట్టకపోవటం ఒక పనిష్‌మెంట్. నాకోసం నువ్వు మానెయ్యటం రెండో పనిష్‌మెంట్. నేను ఆహార ప్రియుడినని నీకు బాగా తెల్సు."

"ఆహారం కన్నా కూడా నన్ను ఎక్కువగా ప్రేమిస్తారని కూడా నాకు తెల్సు. నాకోసం ప్లీజ్. అయినా భగవంతుడే మనకు వానప్రస్థాన్ని ఈ రూపంలో ప్రసాదించాడని ఎందుకనుకోకూడదూ?"

కొత్త తిండికి, కొత్త రుచులకు అలవాటు పడిపోయాడు. సరికొత్త అనుభూతుల్ని పొందాడు. కానీ... కానీ...



ఎంతో దూరం పరుగులెత్తిన ఆలోచనలు వంట ఇంట్లోకి ప్రవేశించాక ఆగిపోయాయి. ఎదురుగా పక్కమీద చలపతి.

"చలపతిగారూ! చలపతిగారూ! ఏమయింది మీకు? ఒంట్లో బాగా లేదా?" దగ్గరగా వెళ్లి అడిగాడు. జవాబు లేదు. అతని కళ్లు జలపాతాలయ్యాయి!

000

కళ్లు తెరిచాడు రాజారావు.

సుభద్ర చేతులు అతడిని పెనవేసుకొని ఉన్నాయి.

ఇన్నేళ్లొచ్చినా సుభద్ర చిన్నపిల్లలా నిద్రలో అతడిని కౌగలించుకోటం మామూలే. ఆ కౌగిలి అనుభూతిని నిద్రలో కూడా ఫీలవుతాడు. మధురానందాన్ని అనుభవిస్తాడు.

రాజారావు టైం చూశాడు. ఈసరికి సుభద్ర ఎప్పుడో లేచి ఉండాలే?

"సుభద్రా... సుభద్రా... తెల్లవారింది. లే." అతను ఆమెను సుకుమారంగా దగ్గరికి తీసుకొంటూ అన్నాడు.

సుభద్ర మాట్లాడలేదు. ఆమె ఒళ్లు చల్లగా ఉంది. ఆమె చేతుల్ని అతి కష్టం మీద తొలిగించుకోగలిగాడు. ఆ తరువాత ఆమెను పరికించి చూశాడు. ప్రపంచం ఒక్కసారిగా తల్లకిందులయినట్లనిపించింది.

"ఏమండీ! మిమ్మల్ని నేనో కోరిక కోరనా?" రాత్రి నిద్రపోయే ముందు ఆమె అడిగింది.

"ఏమిటి అంత పెద్ద కోరిక? నేను తీర్చగలిగేదే."

"గలరో, లేదో నాకు తెలియదు. కానీ తీర్చాలి. అలాగని మాటివ్వాలి?"

"ఇన్నేళ్ల జీవితంలో నువ్వు ఏదీ కోరనే లేదు. ఇప్పుడు నీకో కోరిక కలిగిందంటే నాకెంత ఆనందంగా ఉందో తెలుసా? వెంటనే చెప్పు. తప్పకుండా తీరుస్తానని మాట ఇస్తున్నాను."

"ఏం లేదు. నేను చనిపోతే మీరు పిచ్చివారు కాకూడదు. నిగ్రహం కోల్పోయి ఆరోగ్యం పాడుచేసుకోకూడదు."

"ఓస్. ఇంతే కదా. కోరికంటే ఏమిటో ననుకున్నా. ఈ పిచ్చి కోరికా? నువ్వు పోవు. అసలా ఆలోచన ఎందు కొచ్చిందిట నీకిప్పుడు? రోగమా రొష్టా! ఏం లేదే. పిచ్చి పిచ్చి ఆలోచనలెందుకూ?"

"పోనీ అలాగే అనుకోండి. కానీ నా కోరికను తీరుస్తానని మాటివ్వండి మరి"

"పిచ్చి సుభద్రా. నేనంటే నీకెందుకింత ప్రేమ? అలాగే మాటిస్తున్నాను. ఇక హాయిగా పడుకొని నిద్రపో. సరేనా?" ఆమెను దగ్గరకి తీసుకొంటూ అన్నాడు.

రాత్రి ఆ కోరిక తెల్లవారేసరికి...

"ఇక హాయిగా పడుకొని నిద్రపో" అన్నాడు తను... తన మాట ప్రకారం ఆమె హాయిగా పడుకొని శాశ్వతంగా నిద్రపోతోంది."

"సుభద్రా! సుభద్రా! ఎందు కింత అన్యాయం చేసేవు నన్ను?"

కొడుకూ, కోడలూ, కూతురూ, అల్లుడూ, ఆ చుట్టాలూ, ఈ చుట్టాలూ, స్నేహితులు, పరిచయస్తులు... అంతా వచ్చారు. అన్నీ యాంత్రికంగా అయిపోయాయి.

"మామగారూ! ఇక ఇక్కడ ఒంటరిగా ఏముంటారు? మా దగ్గరికి రాండి."

కోడలు అడిగింది. అల్లుడు అడిగాడు.

ఇద్దరికీ ఆయన డబ్బుమీద ఆశలేదు. ఇద్దరూ చాలా బ్రాడ్ మైండెడ్. వారి ఆహ్వానం లాంఛనప్రాయం కాదు. హృదయపూర్వకమైనదే.

"సంతోషమమ్మా. సంతోషం నాయనా. సమయం వచ్చినప్పుడు తప్పక వస్తాను. మీ దగ్గరకి రాకపోతే ఎవరివద్ద కెళ్తాను?"

"ఇంకెప్పుడు నాన్నా సమయం? అమ్మలేకుండా మీరిక్కడ ఒంటరిగా ఎలా

ఉండగలరు? అసలు ఎందుకుండాలి? మీ ఆరోగ్యం కూడా మంచిది కాదు కదా?"

నవ్వేడాయన.

ఒంటరితనమే. సుభద్రతో తన అనుబంధాన్ని గుర్తుచేసి ఆనందాన్ని కలిగిస్తుందని వారికెలా చెప్పడం? స్మరణ మాత్రాన సుభద్ర తన ఒంటరితనాన్ని పోగొట్టగలదని ఎలా వివరించడం?"

వాళ్ల దగ్గరికి పోతే మనవళ్లు, మనవరాళ్లు, ఆ బంధాలు... సుభద్ర దూరమయిపోదూ?

మర్నాడే ఆయన్ను వెతుక్కుంటూ చలపతి వచ్చాడు.

చలపతి సుభద్రకు చాలా దూరపు చుట్టం. ఆ ఊళ్లో ఏదో పెళ్లికి వంట బృందంతో వచ్చి పలకరించిపోవటానికి వచ్చాడు. అంతా అయ్యాక అసలు విషయంలోకి వచ్చాడు.

"బాబుగారూ! మీరు ఏమీ అనుకోనంటే నాదో అభ్యర్థన. నేను అన్నీ ఉండి దిక్కులేనివాడినయ్యాను. మీరు కూడా ఒంటరివారయ్యారు. మీరు కనికరిస్తే మీకింత వండిపెట్టి నేనింత తిని మీ సేవ చేసుకొంటూ మీ నీడనపడి ఉంటాను. జీతభత్యాలు ఇంత ఇమ్మని నేనడగను. ఎందుకంటే సంపాదించి ఒకరికి పెట్టాలన్న తాపత్రయం నాకు లేదు. కాకపోతే చనిపోయాక ఉత్తర కర్మలకి, ఆ తర్వాత శ్రాద్ధం పెట్టడానికి ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలి కదా? మీరు తృణమో పణమో ఇస్తే అందుకు పనికి వస్తుంది."

కరిగిపోయాడు రాజారావు. బిడ్డలతో "ఈ చలపతి పాపం" నా ఆశ్రయం కోరి వచ్చాడు. తన పరిస్థితిని నిస్సంకోచంగా అంగీకరించగల అమాయకుడు. అంచేత అతనికి ఆశ్రయం ఇస్తాను. అతను నాకు వంట వండిపెడ్తాడు. నా ఆలనా పాలనా చూచుకుంటాడు. నన్ను గురించి విచారించకండి. అవసరమైనప్పుడు నేనే మీ దగ్గరికొస్తానుగా!" అని చెప్పాడు.

చలపతి వంట భయంకరంగా ఉండేది.

"బాబుగారూ! నిన్న పప్పులో కాస్త ఉప్పు తక్కువైనట్లుంది కదూ! ఇవాళ సరిగ్గా వేశాను. ఇవాళైనా తినండి" అంటే ఆరోజు ఉప్పు ఎక్కువ అయినట్లే.

"బాబుగారూ! నిన్న పప్పులో ఉప్పు పొరపాటున ఎక్కువ వేశాను. ఇవాళ గుర్తుపెట్టుకొని సరిగ్గా వేశాను. ఇవాళైనా చూడండి" అంటే అసలారోజు పప్పులో అసలు ఉప్పు వేయడన్నమాటే.


చలపతి పనులన్నీ అంతే. అయినా అతని పనులు రాజారావుకు నవ్వు తెప్పించేవే కానీ చిరాకు తెప్పించేవి కాదు. పెద్దగా ప్రయత్నం లేకుండానే సుభద్ర ఆఖరి కోరిక తీర్చగలుగుతున్నా.

"బాబుగారూ! అనవసరంగా నాకు ఆశ్రయం ఇచ్చి మీరు బాధపడుతున్నారు కదూ? నేను లేకపోతే మీరు హాయిగా ఏ హోటల్లోనో తిని ఉండేవారు. అవునా?" చలపతి ప్రదర్శించే ఆ ఆత్మీయత రాజారావును కదిలించేది.

"చలపతిగారూ! తినటానికి నేను బతకటం లేదు. బ్రతకాలి కనుక తింటున్నాను. మీరు అలా బాధపడకండి."

చలపతికి వంట చెయ్యటం చేతకాదు కానీ, ఎదుటిమనిషి మనసును గ్రహించే శక్తి బాగానే వుంది. "బాబుగారూ! మీ ప్రేమను, అనురాగాన్ని అంతగా పొందిన ఆ మహా ఇల్లాలు నిజంగా అదృష్టవంతురాలండీ!" ఒక రోజు అన్నాడు చలపతి. ఆశ్చర్యపోవటం రాజారావు వంతయింది.

"మీకు తెలీదు కాని, బాబూ! నిద్రలో కూడా



మీరు అమ్మగారిని గురించే కలవరిస్తుంటారు. మేలుకొని ఉన్నప్పుడూ ఆమె ఊసే."

అది మొదలు తన మనసులో బాధల్ని చలపతితో చెప్పుకోసాగాడు రాజారావు. ఆత్మీయత పెరిగింది. ఆరోజు ఆ బంధం తెగిపోయింది.

చలపతి ఉత్తర క్రియలకు దగ్గర ఉండి బాగా జరిపించాడు. శ్రాద్ధం రోజు బీదలకు అన్నదానం చేశాడు. అందుకుగాను వంట చేయటానికి చలపతి కొడుకుల్ని పిలిపించాడు. చాలా గొప్పగా అన్నదానం జరిగింది. వంట చాలా రుచిగా ఉంది. ఎన్నో ఏళ్ల తరువాత ఆరోజు మళ్లీ సుష్టుగా భోజనం చేశాడు రాజారావు. డబ్బు కోసం వచ్చి చేతులు కట్టుకు నిలబడ్డారు చలపతి కొడుకులు.

"మీ వంట చాలా బాగుంది. సుష్టుగా తిన్నాను. కానీ, రేపటికి నేను తిన్నది అరిగిపోతుంది. కానీ ఈ శ్రాద్ధకర్మ ఎవరి కొరకైతే జరిగిందో ఆయన ఒక వంటవాడే. ఆయన వంట బాగుండదు. అయినా చాలా రోజులు తిన్నాను. కానీ ఆయన మనసు మంచిది. మీ వంటను రెండురోజుల తరువాత మర్చిపోగలను కాని, ఆయన మనసును మాత్రం జీవితాంతం మర్చిపోలేను. ఆ వంట మనిషి పేరేమిటో తెలుసా?"

"ఏమిటి?"

"చలపతి! మీరు అన్నం పెట్టకుండా వెళ్లగొట్టిన మీ నాన్నగారు. ఆయనకు మీరు శ్రాద్ధకర్మలను చేసే అర్హతను కోల్పోయారు. అందుకే వంటవారుగా మీ సేవల్ని వినియోగించుకున్నాను."

"క్షమించండి బాబుగారూ!" వాళ్లిద్దరూ ఆయన కాళ్లమీద పడ్డారు.

"మీరు నిజంగా పశ్చాత్తాపం చెందితే ఆయనకు ప్రతి సంవత్సరం శ్రాద్ధం పెట్టి ఒక్కసారి తలుచుకోండి. ఊరికే కాదు. అందుకుగాను ఈ డబ్బు తీసుకోండి."

చలపతి లేని ఇల్లు బావురుమంది. ఒంటరితనం భరించలేకపోయాడు. కొడుకు దగ్గరికో, కూతురు దగ్గరికో పోవాలని నిర్ణయించుకున్నాడు. కానీ ముందుగా ఎవరి వద్ద కెళ్లాలి? బొమ్మా బొరుసూ వేశాడు.

000

"నాన్నా... మీరు...!" రాజారావును చూచి వసంత ఎగిరి గంతేసి చెంగున వచ్చి కౌగలించుకుంది.

"నేనేనమ్మా! వచ్చేశాను. సమయం వచ్చినప్పుడు వస్తానని చెప్పాను గదా!"

"సమయానికి ఆయన క్యాంప్‌కు వెళ్లారు నాన్నా! ఎప్పుడూ ఆయన మిమ్మల్ని గురించే అనుకొంటుంటారు. ఉండండి. మీరొచ్చారని ఫోన్ చేసి వస్తాను."

'ఆయన' నామస్మరణ చేస్తున్నప్పుడు కూతురు మొహంలో మెరుపుల వెలుగును రాజారావు గుర్తించాడు.

"మీరొచ్చారని చెప్పగానే ఆయన పనులన్నీ వదిలేసి జీపులో బయలుదేరి వస్తున్నారు నాన్నా! ఇంకో రెండు గంటల్లో వచ్చేస్తారు."

"పిల్లలేరమ్మా? స్కూళ్లనుంచి ఇంకా రాలేదా? అయిదయిందిగా?"

"స్కూల్లో ఏదో ఫంక్షన్ ఉంది నాన్నా! ఏ ఫంక్షన్ వచ్చినా చిట్టీ, బుజ్జీలు లేనిదే జరగదు. వాళ్ల స్కూల్లో వారానికో ఫంక్షన్ అన్నా జరుగుతుంది. నేను వెళ్లి వాళ్లను తీసుకురావాలి. ఆఫీసునుంచి నేను కూడా ఇప్పుడే వచ్చాను. పనులు చేసుకొని డ్రెస్ అప్ అయి వెళ్దామనుకొంటుంటే మీరొచ్చారు?"

"అంటే నువ్వు కూడా ఉద్యోగంలో చేరావమ్మా? అవసరమా?"

"ఆయన ఇన్‌ఫ్లూయెన్స్ వచ్చింది నాన్నా! వేన్నీళ్లకు చన్నీళ్లు వదులుకోవటం ఎందుకు? పైగా ఆయన ఆఫీసుకు, పిల్లలు స్కూలుకు వెళ్లాక

నేను ఇంట్లో ఉండి చేసేదేముంది? ఆఫీసులో ఉంటే కాలక్షేపం అవుతుంది. పైగా ఆయనతో ఫోనులో ఎపుడు పడితే అప్పుడు మాట్లాడుకునే వసతి ఉంటుంది కదా? అన్నీ ఆలోచించాకనే చేశాను నాన్నా! మీరు స్నానం చేసి రెస్ట్ తీసుకోండి."

వసంత అప్పుడప్పుడూ తనతో మాట్లడుతూనే చకచకా పనులు చేసుకోటం గమనించాడు రాజారావు. సుభద్రా అంతే. ఆమె చిన్నప్పటినుంచీ వంట పనులు, ఇంటిపనుల్లో వసంతకు శిక్షణ ఇచ్చింది. కాఫీ ఫిల్టర్ వేయటం చూచాడు. కానీ ఎంతకీ కాఫీ తీసుకురాదేం? పైగా మిక్సీలో పప్పువేసి రుబ్బుతోంది. అంటే తన కిష్టమైనవి చేసి పెడుతుందన్నమాట! కూతురు కనుక తనక్కావల్సినవి చెప్పకుండానే తెలుసుకోగలిగింది. పైగా సుభద్ర ట్రెయినింగ్ ఎక్కడి పోతుంది.

"నాన్నా! నేను స్కూలు కెళ్లి పిల్లల్ని తీసుకువస్తాను. ఫంక్షన్ పూర్తి కాకపోయినా ఎనిమిది కాకముందే వచ్చేస్తాను. మళ్లీ ఆయన ఎనిమిదింటికి వస్తారు కదా!"

ఆమె అన్నట్లే ఎనిమిదింటికి గోపాలరావు వచ్చాడు. కాఫీ కప్పుతో భర్తకు స్వాగతం చెప్పింది.

కాఫీ వాసన కమ్మగా ఉంది. సుభద్ర కాఫీ కూడా ఇదే వాసన వచ్చేది. వాసన చూచి గుటకలు మింగాడు రాజారావు.

"మీ నాన్నగారికి కాఫీ ఇవ్వవా?"

"భలేవారే. నాన్నగారు కాఫీ మానేసి ఎంతకాలం అయిందనుకున్నారు. వెధవ అలవాటును మళ్లీ చేయించమంటారా, ఏమిటి? మీరు తాగండి."

అతను స్నానం చేయటానికి వెళ్లిన సమయంలో గారెలు చేయసాగింది. పిల్లలు గారెలు తెచ్చుకుని వేడి తగ్గటానికి నోటితో ఊదుకుంటూ తింటున్నారు.

సుభద్ర గారెలు చేస్తుంటే తను వంటగదిలోకి జొరబడి వేడి వేడిగా ఒక్కొక్క గారే తినేవాడు. వాయ దిగేసరికి వాయ అయిపోతుండేది.

"చిన్న పిల్లాడిలాగా ఏమిటండీ ఇది!"

"గారెలు తినటం దగ్గర నేను చిన్నపిల్లాడినే మరి! ఎప్పుడు వేసిన గారెలు అప్పుడు వేడి వేడిగా తింటేనే మజా! అన్నీ చేశాక ఒక్కసారి లాగెయ్యటం నా వద్ధతి కాదు."

"నాన్నా! భోజనానికి రండి."

విస్తరి ముందు కూర్చున్నాడు. గోపాలరావు కంచం పక్క ప్లేటులో గారెలున్నాయి. తన విస్తట్లో ఒక్క గారె కూడా లేదు.

"అదేమిటి వసంతా! మామగారికి గారెలు వెయ్యలేదేం?"

"మా నాన్నగారికి ఏం పెట్టాలో నాకు తెలుసులేండి! మా అమ్మ ఆయనకు ఎలా చేసిపెట్టేదో నాకు తెలుసుకదా మీకెందుకు? గారెలు వేడి చల్లారిపోతాయి. మీరు తినండి."

"ఫర్వాలేదమ్మా! ఆ పత్యాలు అవీ మీ అమ్మతోనే పోయాయి. ఇప్పుడు నేను అన్నీ తింటున్నాను. నా కిష్టమైనవి చేయించుకు తినటానికే నీ దగ్గరికొచ్చానసలు. ఆ గారెలు ఓ అరడజను ఇలా పడేయి."

"పత్యాలు మానేశారా? అయితే ఇవాళ్లనుండి మళ్లీ ఆరంభించండి. అందుకే మీ వంట స్పెషల్‌గా చేశాను. తెలుసా?"

ఒక్కో పదార్థాన్ని నోట్లో పెట్టుకొని రుచి చూచాడు. దేనిలోనూ కారం, ఉప్పూ, పులుపు లేదు. చలపతి వంట ఇంతకన్నా నయం.

మర్నాడు ఉదయం నిద్ర లేచిన దగ్గరినుంచి



ఎవరి హడావిడి వారిది.

నాన్నా! నీ భోజనం టేబుల్‌మీద పెట్టాను. పేపర్లు, పుస్తకాలు ఉన్నాయి. టీ.వీ. టేప్ రికార్డర్ ఉన్నాయి. హాయిగా రెస్ట్ తీసుకో. నేను పిల్లల్ని తీసుకొని అయిదింటికి వచ్చేస్తా?"

అయిదింటికి పిల్లలతో వచ్చీ రాగానే వాళ్ల పుస్తకాలు ముందేసుకొని కూర్చుంది. ఎనిమిదింటికి గోపాలరావు రాగానే భోజనా. ఆ తరువాత ఎవరి గదుల్లో వారు దూరి లైట్లారెవ్వయ్యటం.

ఆ యాంత్రిక జీవితంలో అనురాగాలకు, అనుబంధాలకు టైమేదీ? మూడురోజులకే ఒంటరితనాన్ని భరించలేకపోయాడు.

"అమ్మా! నేనింక వెళ్లి వస్తానమ్మా!"

"ఏం నాన్నా! నామీద కోపం వచ్చిందా? ఇక్కడే ఉండిపోతావనుకొన్నానే!"

"ఇప్పుడు కాదమ్మా! మరోసారి వచ్చినప్పుడు."

000

"నాన్నగారూ! రండి. రండి. లావణ్యా! లావణ్యా! ఎవరొచ్చారో చూడు." మేడపైనుంచే తండ్రి రిక్షా దిగటం చూసి హడావుడిగా కిందికి దిగివచ్చి ఆప్యాయంగా ఆహ్వానించాడు శ్రీహరి.

"ఉత్తరం రాస్తే కారు తీసుకొని వచ్చేవాడిని కదా నాన్నా!"

"ఉత్తరం రాసే వ్యవధి ఎక్కడిదిరా అబ్బాయ్? సమయం తరుముకొని వచ్చింది. వచ్చేశాను."

"చాలా సంతోషం నాన్నగారూ! ఇప్పటికైనా మామీద దయ కలిగింది. లావణ్యకు మీరు అక్కడ ఒంటరిగా ఉండటం అసలు ఇష్టం లేదు. ఎప్పుడూ అంటూంటుంది."

"అన్నట్లు కోడలేది?"

పరుగు పరుగున అప్పుడే అక్కడి కొచ్చి నిలబడ్డ ప్యూనువైపు ప్రశ్నార్థకంగా చూశాడు శ్రీహరి. "అమ్మగారు ప్రొద్దున్నే ఎవరో గెస్ట్‌ని రిసీవ్ చేసుకోటానికి స్టేషన్‌కి వెళ్లారండీ. ఎవరో ఫ్రెండ్ వచ్చి కారులో తీసుకెళ్లారు."

"సరే. వీరు మా నాన్నగారు. చాలా జాగ్రత్తగా చూచుకోవాలి. ఎలాంటి అసౌకర్యం కలగకూడదు. మేడపైన ఏ.సీ. గెస్ట్ రూం నంబర్ వన్‌లో ఆయన ఉంటారు. వంట మనిషి రాములమ్మగారితో కూడా చెప్పు. రండి నాన్నా! మీ రూమ్ చూపిస్తాను."

"నా రూం ఏమిట్రా? నాకు రూం ఎందుకు? ఈ వరండాలో మంచం వేసుకొని పడుకుంటాను. ఎవరో అతిథి వస్తే మర్యాద చేసినట్లు చేయకు."

"అది కాదు నాన్నా! అది లావణ్య పద్ధతి. తన పద్ధతికి వ్యతిరేకంగా ఏం జరిగినా ఊరుకోదు. ఎవరిగది వారికే ఉండాలి. వరండాలో చూసినా బాగుండదు కదా? మేమంతా ఏ.సీ. రూముల్లో ఉంటూ మిమ్మల్ని వరండాలో ఉంచుతామా?"

"ఊఁ... సరేలే!"

ఏ.సీ. గెస్ట్ హౌస్ నంబర్ వన్ సర్వాంగ సుందరంగా ఉంది. ఎటాచ్డ్ బాత్‌రూమ్ అండ్ టాయ్‌లెట్, టీవీ., టెలిఫోన్, డబుల్ కాట్ ఫోంబెడ్, మిర్రర్, హాంగర్, మ్యూజిక్ ఛానల్ కంట్రోల్ సిస్టం అన్నీ వివరించి చెప్పాడు శ్రీహరి.

"మీకేం కావాలన్నా కాలింగ్ బెల్ నొక్కండి. ప్యూన్ వస్తాడు. నేను అర్జెంటుగా కాన్ఫరెన్సుకు వెళ్లాలి. వస్తాను. లావణ్యకు మీరొచ్చారని ఫోన్ చేసి చెప్తాను."

శ్రీహరి వెళ్లిన ఒక్క నిముషానికి బజర్ మోగింది. 'లోపలికి రావచ్చా?' అన్న సంకేతపు మోత అది. ఆ విషయం తెలియదు రాజారావుకి.

"మే ఐ కమిన్ సార్!" తలుపు తట్టి అడుగుతూనే లోపలి కొచ్చాడు సర్వెంట్ నిగ నిగలాడుతున్న సిల్వర్ ట్రేలో తళతళలాడుతున్న పింగాణీ టీ సెట్టు జార్‌లో నుంచి కప్పులో పోశాడు.

"బోర్నవీటా సర్!"

"వద్దు. కాఫీ తీసుకురా."

"ఎక్స్‌క్యూజ్ మి సర్! ఈ ఇంట్లో ఎవరూ కాఫీ

మిగతా భాగం 57వ పేజీలో...

13వ పేజీ తరువాయి భాగం...

తాగటానికి వెళ్లదు. అమ్మగారి రూల్."

"అయితే అవన్నీ తీసుకెళ్లు. నాకో చాప తెచ్చిపెట్టు. హాయిగా పడుకుంటాను."

"చాపా! లేదు సార్! అమ్మగారొచ్చాక చెప్పి కొనుక్కొస్తాను. అయినా..."

"ఇక నువ్వెళ్లు."

మరి కాసేపటికి డాక్టర్ వచ్చి ఆయన్ని 'కంప్లీట్ చెకప్' చేశాడు.

"ఎవరు చేయమన్నారీ చెకప్? నాకేం, నేను బాగానే ఉన్నాను కదా!"

"ఆ సంగతి చెప్పాల్సింది నేను. కంప్లీట్ రిపోర్ట్ రాసి మిసెస్ లావణ్యగారికి కిస్తాను. మధ్యాహ్నమవుతుండగా లావణ్య ఫోన్ చేసింది.

"హలో మామగారూ! వెల్‌కమ్ టు యూ ప్లెజంట్ సర్‌ప్రయిజ్ కొట్టారు. ఢిల్లీ నుంచి ఒక వి ఐ పి వచ్చింది. అందుచేత వెంటనే రాలేకపోతున్నాను. మీకింట్లో అంతా సౌకర్యంగా ఉంది కదా! మీరు ఎర్లీగా లంచ్ తీసుకుంటారు కదా! తీసుకోండి. డైనింగ్ హాల్ కెళ్తారా? రూంకి తెప్పించుకుంటారా? మీ ఇష్టం. నేను సాధ్యమయినంత త్వరగా వస్తాను. గుడ్‌బై."

ఆతనికి ఆకలితో కడుపు నకనకలాడుతోంది. డైనింగ్ హాల్‌కే వెళ్లి సుష్టుగా లాగేయాలనుకున్నాడు. ఆ వంటమనిషి రాములమ్మ చేతి వంట ఎలా ఉంటుందో? దాదాపు యాభై ఏళ్ల మనిషి రాములమ్మ.

"అమ్మగారి మామగారా మీరు? తీరిక చిక్కితే చాలు అమ్మగారు అత్తగారినీ, మామగారిని పొగుడుతుంటారు. మీ రిద్దరూ చాలా మంచివారనీ, అన్యోన్యంగా ఉండేవారని, మీ భార్యగారు వంట అద్భుతంగా చేస్తారని...!"

కొడుక్కీ, కోడలికీ తమ పట్ల ప్రేమ ఉందని ఆయనకు తెలుసు. కానీ ఇంతగానా? పరవశించిపోయాడు రాజారావు.

"వడ్డించాను. భోం చేయండి."

"టేబుల్‌పైనా? బాసింపట్లు వేసుకొని కింద కూర్చొని భోంచేస్తాను."

"అమ్మగారి అనుమతి కావాలి. ఇవ్వాల్టి కిలా కానీయండి."

టేబుల్ నిండా పింగాణీ ప్లేట్లు. కప్పులు. అందులో కొద్ది కొద్దిగా రకరకాల పదార్థాలు. ఒక్కటీ ఆయనకి తెలిసిన పదార్థం కాదు.

"రాములమ్మగారూ! ఏమిటండి ఇవన్నీ."

"రుచి చూండి. మీకే తెలుస్తుంది."

"ఊహూ! ఏం తెలీలా. కానీ ఇవి మనుషులు తినేవి కాదని మాత్రం తెలిసింది. ఇదేదో ఈ పదార్థం కాస్త బాగున్నట్లుంది. తగలెయ్యండి. ఆ పెరుగు కాస్త వెయ్యండి."

"అమ్మగారి ఆర్డర్ కావాలి సార్! ఈ పూటకిలా కానివ్వండి."

"అసలిదేంటి? అందరికీ ఇలాగే వండి పెడతావా? ఇలాగే కొలతలా?"

"డాక్టర్ రిపోర్టు ప్రకారం ఎవరికి ఎలాంటి ఆహారం ఇవ్వాలో అంత మాత్రమే కొలత ప్రకారం ఇమ్మని అమ్మగారి ఆజ్ఞ సర్! అయ్యగారికి, అమ్మగారికీ, ఆఖరికి నాకూ అంతే. మిమ్మల్ని పరీక్ష చేసిన డాక్టర్ చేసిన వంట రికమండేషన్స్ ఇవి."

రాజారావుకు అప్పుడు గుర్తు కొచ్చింది. లావణ్య హోమ్ సైన్స్ గ్రాడ్యుయేట్ అని. పగలబడి నవ్వాడు.

"ఏమ్మా! ఈ కేలరీల కొలత భోజనం ఏమిటి? హోటల్స్‌లో లాగ ఈ పద్ధతులేమిటి?"

"అంతా మన మంచికే మామయ్యగారూ. మీకు పుణ్యముంటుంది. నా పద్ధతులతో సర్దుకుపోండి.



అయినా వయసులో ఉన్న నేను, ఆయన అందరం ఫాలో అయ్యే పద్ధతుల్ని వయసు పైబడిన మీరు, ఫాలో కావటం ఏం కష్టం?"

రాత్రయినా పిల్లలు కనిపించలేదు. అడిగాడు.

"పిల్లల్ని రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్‌లో జాయిన్ చేశామండి. ఇంట్లో ఉంటే చదువు ఏం వస్తుంది? అందుకని."

"శ్రీహరి మా ఇంట్లో ఉండే చదివేడమ్మా!"

"ఆ కాలం వేరు మామయ్యగారూ!"

లావణ్యకు సంఘ సేవతో తీరిక చిక్కదు. శ్రీహరికి ఆఫీసు పనుల్లో తీరిక చిక్కదు. అతనింట్లో ఉంటే ఈమె ఉండదు. ఈమె ఉంటే అతను ఉండడు. బిడ్డలు సరే సరి.

ఇద్దరి మధ్య వ్యవహారాలన్నీ ఫోనుల ద్వారానే జరుగుతుంటాయి. రెండు రోజులకే ఒంటరితనం అతడిని వేధించసాగింది.

"రాములమ్మగారూ! ఒకప్పుడు అంటే ఇక్కడికి రాకముందు మీరు బాగా వంట చేసేవారు. అవునా?"

"చాలా పేరుండేదండీ. కానీ, ఇప్పుడు వంట చెయ్యటం మరిచిపోతానన్న భయంగా ఉంది. అసలు అన్నీ చేతనయి మంచి తిండికోసం మొహం వాచిపోవాల్సిన గతి పట్టింది నాకు. డబ్బు కక్కుర్తితో ఇక్కడ పడి ఉండడమే కానీ, చేసిన వంటను తృప్తిగా తింటేనే కదటండీ వంట వారికైనా ఆనందం? ఏమిటో నా కర్మ."

"అయితే నేనో కోరిక కోరతాను. ఏమనుకోకుండా తీరుస్తారా?"

"చెప్పండి."

ఆమె మొదట్లో సందేహించినా చివరికి అంగీకరించింది.

"చెప్పిపోదామంటే భార్యా భర్తలు మీరిద్దరూ బిజీ. అందుచేత ఈ కాగితం రాసి వెళ్లిపోతున్నాను. అన్నట్లు నాకు వండి పెట్టటానికి మీ వంటలమ్మను తీసుకుపోతున్నాను. సమయం వచ్చినప్పుడు ఈసారి మిమ్మల్నే పిలుస్తాను. వచ్చి నాకోరిక తీరుస్తారు కదూ?"

000

"సమయం వచ్చింది. ఈ టెలిగ్రాం అందగానే పిల్లలతో సహా రండి. ఇది నా ఆఖరి కోరిక."

టెలిగ్రామ్ చూచుకొని అన్ని ప్రోగ్రామ్స్ కేన్సిల్ చేసుకొని కంగారు కంగారుగా అంతా రాజారావువద్దకెళ్లారు.

"ఎప్పుడో చనిపోవాల్సిన వ్యక్తి. మీ రాకకోసమే బతికున్నాడు." డాక్టర్ చెప్పాడు.

"అసలు కంప్లయింట్ ఏమిటి డాక్టర్?"

డాక్టర్ వారికి అంతా వివరించాడు.

"డాక్టర్ వద్దన్నా ఎందుకు తిన్నావు నాన్నా? కోరి చావును ఎందుకు తెచ్చుకున్నావు?"

"ఒంటరితనం భరించలేక."

"అమ్మ లేకపోయినంత మాత్రాన మీరు ఒంటరి అయిపోయారా? మా దగ్గరికి వచ్చినట్లే వచ్చి ఎందుకు పారిపోయారు?"

"ఒంటరితనం భరించలేకనే."

విస్తుపోయారంతా!

"అది చెప్పటానికే మిమ్మల్ని పిలిపించాను. మీ అమ్మ పోయాక కూడా చలపతి ఉన్నంత కాలం నేను ఒంటరితనాన్ని ఫీల్ కాలేదు. కానీ నన్ను ఎంతగానో ప్రేమించే మీ ఇళ్లలో రెండు రోజులుండేసరికి ఒంటరిననిపించింది. అది మీ తప్పు కాదు. మన జీవన విధానాల్లో వ్యత్యాసం అది. కానీ మీకు ఆఖరి సలహా ఒకటి ఇవ్వనా?"

"ఇవ్వండి."

"మనిషికి మనిషి తోడే కాదు. మనసు తోడూ కావాలి. డబ్బు, భోగసాధనాలు, కూలి మనుషులు తోడిచ్చే మనసుకు ప్రత్యామ్నాయాలు కాలేవు."

ఆయన సలహా ఎవరికీ అర్థం కాలేదు. కానీ కర్మకాండలన్నీ ముగిశాక ఆ సలహాని పదే పదే నెమరువేసుకోగా కొత్త కొత్త అర్థాలెన్నో స్ఫురించసాగాయి వారికి. ■